క్లుప్తంగా

ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా


ట్యాంకర్ వద్ద తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

నందవరం: మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో సర్పంచ్ మునెమ్మ, ఎంపీటీసీ సభ్యులు హనుమంతమ్మ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. బుధవారం గ్రామంలో దేవర ఉండటంతో బీసీ, ఎస్సీ కాలనీల వాసులు పడుతున్న తాగునీటి ఇబ్బందులను గమనించి ట్యాంకర్ ద్వారా సరఫరా చేసినట్లు వారు తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నందవరం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–4లో గర్భిణులు, బాలింతలు, తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని రం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు సక్రమంగా అందించాలన్నారు. అలాగే గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి


భీష్మ చిత్రపటంతో సాగుతున్న ఊరేగింపు

వెల్దుర్తి: మండల కేంద్రంలో బెస్త సంఘం ఆధ్వర్యంలో బుధవారం భీష్మ ఏకాదశి ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా పట్టణంలో బైక్ ర్యాలీ, అనంతరం భీష్మ చిత్రపటానికి పూజలు చేసి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఆ తర్వాత ఎల్లమ్మగుడి రస్తాలోని గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

త్వరలోనే బిల్లులు మంజూరు చేస్తాం

మద్దికెర: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి బిల్లులు మంజూరు చేయకపోవడంతో సర్పంచ్ ఆంజనేయులు తాళాలు వేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి గ్రామానికి వెళ్లి సర్పంచ్ ఆంజనేయులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల బిల్లుల మంజూరులో జాప్యం జరిగిందన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సకాలంలో బిల్లులు మంజూరు చేయిస్తామన్నారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ రవీంద్రనాథ్, పీఏ రాఘవేంద్ర ఉన్నారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


శ్రీ కొలుట్ల చెన్నకేశవస్వామి

ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీ కొలుట్ల చెన్న కేశవస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి, ఈఓ బి.చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు చిన్నయ్య స్వామి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఉత్సవాలకు అంకుర్పాణం చేశారు. పి.కోటకొండ గ్రామానికి చెందిన ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి ఇంటి నుంచి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో రాత్రి 12 గంటలకు పర్వతారోహణం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైద్య సిబ్బందిపై బదిలీ వేటు

హొళగుంద: స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బందిపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. డాక్టర్ రాధ, ఫార్మాసిస్ట్ నాగన్నగౌడ్ తరచూ గొడవ పడేవారు. వీరి విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారి ఆదేశాలతో డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య బదిలీ వేటు శారు. డాక్టర్ రాధను గజ్జహళ్లికు, ఫార్మాసిస్ట్ నాగన్నగౌడ్‌ను నంద్యాల జిల్లా డీబగుంట్లకు నియమిస్తూ డీఎంహెచ్‌ఓ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి తెలిపారు. కాగా గజ్జహళ్లి డాక్టర్ న్యూటిన్, ఫార్మాసిస్ట్ సురేష్‌ను హొళగుందకు బదిలీ చేసినట్లు తెలిపారు.

బాలుడికి డెంగీ లక్షణాలు

వెల్దుర్తి: మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలుడికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు సమాచారం. మూడు రోజుల క్రితమే నాలుగేళ్ల బాలుడికి డెంగీ నిర్ధారణ కాగా బుధవారం మరొకరికి లక్షణాలు కనపడటంతో సర్పంచ్ రాములమ్మ, సెక్రటరీ రాధిక ఆధ్వర్యంలో కృష్ణగిరి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మధుసూదన్ సమక్షంలో బాధితుల ఇళ్ల వద్ద శుభ్రత చర్యలు చేపట్టారు. దోమల నివారణకు పిచికారీ చేయించి, స్థానికుల రక్త నమూనాలు సేకరించారు. అలాగే ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓఆర్డీ నరసింహులు పనులు పరిశీలించారు.

తుగ్గలి మండలం రాతనలో సుంకమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ రాజశేఖర్



తుగ్గలిలో 80 శాతం..
తొలిరోజు మండలంలో 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. మండల వ్యాప్తంగా 7,654 మందికి రూ.2,11,61,250 విడుదల చేసింది. తొలి రోజు సాయంత్రం 6 గంటలకు 80 శాతం పెన్షనర్లకు పింఛన్ పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎం బాషా తెలిపారు.

చిప్పగిరి మండలం నంచర్ల గ్రామంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ దివాకర్



చిప్పగిరి: సూర్యోదయాన్నే వలంటీర్లు పింఛన్ కానుక పంపిణీకి బయలుదేరారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వేలిముద్రలు తీసుకుని పింఛన్ సొమ్ము అందజేశారు. మండల వ్యాప్తంగా 3,508 పింఛన్లు ఉండగా మొదటి రోజు దాదాపు 80 శాతం పైగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

నందవరం మండలం ప్రభావతికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చిన్నభీమన్న



నందవరం: మండలంలో పింఛన్ల పంపిణీని వలంటీర్లు సూర్యోదయాన్నే మొదలుపెట్టారు. మొత్తం 7,036 పింఛన్లు ఉండగా బుధవారం 5,297 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మొదటి రోజే దాదాపు 75 శాతానికి పైగా పంపిణీ పూర్తయిందని మరో రెండు రోజుల్లో 100 శాతం పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

గోనెగండ్లలో వృద్ధురాలు రామక్కకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ లక్ష్మి



గోనెగండ్లలో 95 శాతం..
గోనెగండ్ల: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గ్రామ వలంటీర్లు బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. తెల్లవారు జాము నుంచే గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను డబ్బును అందజేశారు. మొదటి రోజు మండలంలో 95 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో 100 శాతం పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

వేకువ జామునే సంక్షేమ కాంతులు

- లబ్ధిదారు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేసిన వలంటీర్లు

వైఎస్సార్ పింఛన్ కానుక బుధవారం వేకువ జామునే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టింది. పింఛన్‌దారుల జీవితాల్లో సంతోషాల కాంతులు వెదజల్లింది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పెన్షనర్ల ఇళ్లకు చేరుకుని వేలి ముద్రలు సేకరించి పింఛన్ సొమ్మును అందజేశారు. వేలి ముద్రలు పడి వారికి ఐరీస్ ద్వారా పింఛన్లను పంపిణీ చేశారు.


పెరవలిలో లక్ష్మిదేవి నుంచి ఐరీస్ సేకరిస్తున్న వలంటీర్ రామాంజులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సంధ్యారాణి

మద్దికెరలో 94 శాతం..
మద్దికెర: మండలంలో పింఛన్ల పంపిణీని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు బుధవారం తెల్లవారు జాము నుంచే ప్రారంభించారు. సాయంత్రంలోపు మండల వ్యాప్తంగా 94 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు.

హొళగుందలో 80 శాతం..
హొళగుంద: తెల్లవారుజాము నుంచి గ్రామాల్లో పింఛన్ల పంపిణీ సందడి నెలకొంది. మండలంలో మొత్తం 5,853 పింఛన్లు ఉండగా 80 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.


కృష్ణగిరి: పెనుమాడలో రామచంద్రారెడ్డి నుంచి వేలిముద్రలు సేకరిస్తున్న వలంటీర్లు

కృష్ణగిరిలో 85 శాతం..
కృష్ణగిరి: ఫిబ్రవరి నెలకు సంబంధించి మొదటి రోజు బుధవారం రాత్రి 7 గంటలకల్లా 85 శాతం పింఛన్ పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో లబ్ధిదారులకు సకాలంలో అందించేలా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన సీఐ మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరు రూరల్: రూరల్ సీఐగా కె.మోహన్‌రెడ్డి బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ బీపీ మంజునాథ్ కర్నూలు త్రీ టౌన్‌కు బదిలీ కాగా ఆ స్థానంలో వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు సీఐగా కె.మోహన్‌రెడ్డిని పోలీస్ ఉన్నతాధికారులు నియమించారు. నూతన సీఐకు ఎస్ఐ సునీల్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ కె.మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

ఆలూరు రూరల్: స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలను గోడపై నుంచి తీయించి మూలనపెట్టి అవమానించిన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆలూరు మండల కార్యదర్శులు పోతురాజు, మైనా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గాయత్రికి వినతి పత్రం అందించారు. ధర్నాలో డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉలిరాజు, ధన్‌రాజ్, సిద్ధు, మహేష్, గాదిలింగ, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

హొళగుంద: కుక్కల దాడిలో బుధవారం పలువురు గాయపడ్డారు. మండల కేంద్రానికి చెందిన వీరభద్ర, సాయికుమార్, మహమ్మద్‌హాజీతో పాటు ముద్దటమాగి గ్రామానికి చెందిన సోమేశ్‌పై కుక్కలు దాడి చేసి గాయపరిచినట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు హొళగుంద ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

ఉగాది నాటికి జగనన్న కాలనీలు ప్రారంభం


అధికారులతో సమీక్ష చేస్తున్న ఆర్డీఓ మోహన్‌దాస్

మద్దికెర: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలను ఉగాది నాటికి ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని మద్దికెర, పెరవలి, యడవలి తదితర గ్రామాల్లో జగనన్న కాలనీలను పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలలో నిర్మాణాలు పూర్తి చేసుకుంటే సకాలంలో బిల్లులు మంజూరు, నీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని విషయాలను లబ్ధిదారులకు చెప్పాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగరాజు, హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ పాల్గొన్నారు.

వైభవం.. రంగస్వామితాత రథోత్సవం


రథోత్సవాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని దేవబెట్ట గ్రామంలో రంగస్వామి తాత రథోత్సవం బుధవారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రభోత్సవం నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ వీధుల్లో రథోత్సవాన్ని కడు రమణీయంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కనుల పండువగా లంకా దహనం


స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఉంచి పూజలు నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు


బాణాలను కాల్చుతున్న దృశం


పాము ఆకారంలో కాలుతున్న బాణా సంచా

హొళగుంద: శ్రీసిద్ధేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో బుధవారం లంకా దహన కార్యక్రమంలో కనుల పండువగా సాగింది. ఉత్సవాన్ని తిలకించేదుకు ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. ముందుగా సిద్ధప్ప, సిద్ధమ్మ ఉత్సవ విగ్రహాలకు పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం సిద్ధమ్మను ఆలయంలో ఉంచి సిద్ధప్ప మూర్తిని పల్లకీలో అధిష్టించి ఆలయం చుట్టూ, తేరుబజారులో ఊరేగించారు. స్వామి వారు తిరిగి సిద్ధమ్మ అమ్మవాకి వద్దకు చేరుకోవడంతో బాణా సంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ ఘటననే లంకదహన అంటారని ధర్మకర్త రాజ పంపన్నగౌడ్, నిర్వాహకులు శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్ తెలిపారు. పూజల్లో శిరుగుప్ప ఎమ్మెల్యే సోమలింగప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, మహేంద్ర, గుమ్మనూరు నారాయణస్వామి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు భేష్

- నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

కృష్ణగిరి: కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో బాగా అమలవుతున్నాయని నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సంతోష్‌కుమార్, ప్రదీప్‌కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పోతుగల్లు గ్రామంలో బుధవారం వారు పర్యటించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి ఈ వ్యవస్థ ద్వారా సేవలు ఎలా అందుతున్నాయని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద మంజూరైన ఇంటి నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఉపాధి పనులు, వేతనం, పని దినాలపై ఆరా తీశారు. పని దినాలు, వేతనం పెంచాలని కూలీలు కమిటీ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి, సర్పంచ్ తెలుగు వాణిశ్రీ, ఎంపీటీసీ సభ్యురాలు బేతపల్లె రాజేశ్వరి కోరగా.. నివేదికను కేంద్రానికి పంపుతామని హామీ ఇచ్చారు. వీరి వెంట వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సలీంబాషా, పీఓ శ్రీధర్‌రెడ్డి, ఏపీడీ లక్ష్మణ్, సీడీసీఎల్ఆర్సీ బ్రహ్మానందరెడ్డి, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మోహన్‌కుమార్, హౌసింగ్ డీఈ గురుప్రసాద్ ఉన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయండి

మద్దికెర: కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ సూచించారు. బుధవారం మద్దికెరలో కుష్టువ్యాధి నిర్మూలనపై వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలు నిర్వహిస్తామన్నారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలుంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలన్నారు. ఉచిత వైద్యంతో పాటు మందులు ఇస్తామన్నారు.

హామీలు అమలు చేసిన ఘనత జగన్‌దే

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- జొన్నగిరిలో రెండోరోజు 'గడప గడపకు మన ప్రభుత్వం'


జొన్నగిరిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: పాదయాత్రలో నాటి ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చిన వాటన్నింటినీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం సాయంత్రం రెండోరోజు జొన్నగిరిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. మూడున్నరేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. ప్రతి కుటుంబం తన కుటుంబంగా భావించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్నకు అండగా ఉండాలని ప్రజలను కోరారు.

పథకాలు చేరువ చేసేందుకే గృహసారథులు
ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకే సీఎం జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. జొన్నగిరిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకొని వారికి ఇంకా ఏమి అవసరమో తెలుసుకోవాల్సి ఉందన్నారు. పేదల కళ్లలో సంతోషమే ధ్యేయంగా జగనన్న పాలన చేస్తున్నారన్నారు. 25 ఏళ్లలో పత్తికొండలో జరగని అభివృద్ధి మూడేళ్లలో చేసి చూపించామన్నారు. త్వరలో హంద్రీనీవా నీటితో చెరువులు నింపుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్, జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, నాయకులు రామచంద్రారెడ్డి, హనుమంతు, నాగప్ప, ప్రతాపరెడ్డి, దేవి, భాస్కరరెడ్డి, లోకనాథరెడ్డి, రఘు, సోమశేఖరరెడ్డి, పక్కీరప్ప, సుంకప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం పత్తికొండలో హౌసింగ్‌శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామసచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎమ్మెల్యే సమావేశమై జగనన్న కాలనీలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులకు ఎప్పటికప్పుడే బిల్లులు చెల్లించాలన్నారు. బిల్లుల విషయంలో అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ నారాయణదాసు, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఆలీ, సర్పంచులు అంజినయ్య, శ్రీరాములు, కేశవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శిఖర కలశ ప్రతిష్ఠాపన

గోనెగండ్ల: భీష్మ ఏకదాశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో గ్రామ పెద్దలు ఈశ్వర, ఆంజనేయ, బీరప్ప స్వామి ఆలయాలకు శిఖర కలశ ప్రతిష్ఠాపన పూజను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లో వెలసిన దేవతా మూర్తులను ప్రత్యేక పూలతో అలంకరించారు. ఈశ్వర, ఆంజనేయ, బీరప్ప ఆలయాల్లో రుద్రాభిషేకం, ఆకు పూజ, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. శిఖర కలశ ప్రతిష్ఠాపన సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను సర్పంచ్ మౌనిక ప్రారంభించారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొన్న వాహనం


నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఆస్పరి: మండల కేంద్రంలోని ఆలూరు రోడ్డులో పోలీసు క్వార్టర్స్ వద్ద 11 కేవీ విద్యుత్ స్తంభాలను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో మూడు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో బీసీ కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ అధికారులు, ఎస్ఐ వరప్రసాద్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. బుధవారం ఉదయం ఏఈ మల్లికార్జున ఎల్ఐ జయన్న విద్యుత్ లైన్ సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు.

లాలుస్వామి ఉరుసు చూతము రారండి!

- 4 నుంచి తాత లాలుస్వామి ఉత్సవాలు
- జిల్లా నలుమూలల నుంచి భక్తులు రాక
- 6న రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు


శ్రీ తాత లాలుస్వామి దర్గా


తాత సమాధి

కృష్ణగిరి: కొలిచే వారికి కొంగు బంగారమై, ఆపదలో ఆదుకునే మహిమానిత్యుడు శ్రీ తాత లాలుస్వామి భక్తుల నుంచి పూజలందుకునేందుకు సిద్ధమయ్యారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో వెలసిన తాత లాలుస్వామి ఉరుసు ఉత్సవాలు ఈ నెల 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. అందుకు కావాల్సిన ఏర్పాట్లను దర్గా ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తి చేశారు.

తాత చరిత్ర
దాదాపు 200 ఏళ్ల క్రితం గ్రామంలో బోయ ఉలిగి కుటుంబంలో జన్మించిన లాలుస్వామి చిన్నతనం నుంచే మహిమలు చూపుతూ అందరి మన్ననలు పొందారు. ఎవరికైనా జ్వరం వచ్చినా ఇతన్ని అనుసరిస్తే నయమయ్యేదని, కరువు సమయంలోనూ గ్రామాన్ని రక్షించారని పెద్దలు చెబుతారు. అలాగే వ్యవసాయ సాగులో లాభనష్టాలను, ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే తెలిపేవాడట. భక్తుల సంఖ్య అధికం కావడంతో గ్రామాన్ని సుభిక్షంగా కాపాడేందుకు 150 ఏళ్ల క్రితమే జీవ సమాధి అయ్యారని ప్రతీతి.

గ్రామస్తులంతా లాలుస్వాములే..
లాలుస్వామి తన మహిమల వల్ల మొదట్లోలబ్ధిపొందిన వారు తమ పిల్లలకు ఆయన పేరే పెట్టుకునే వారు. దీంతో గ్రామంలో లాలుస్వామి పేరు ఉండని ఇల్లు ఉండదు. అలాగే కొత్త వాహనం కొనుగోలు చేసినా, ఏదైనా కార్యక్రమం ప్రారంభించినా లాలుస్వామి పేరుతోనే మొదలు పెడుతున్నారు.

మూడు రోజులు పాటు కార్యక్రమాలు
ఉరుసు ఉత్సవాల్లో భాగంగా 4న స్వామి వారికి అశ్వవాహనంపై గంధం సమర్పణ ఉంటుంది. 5న ఉరుసు, 6న కిస్తీతో ఉత్సవాలు ముగుస్తాయి. చివరి రోజు రాష్ట్రస్థాయి పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన వృషభాల యజమానులకు కమిటీ తరఫున, దాతల సహకారంతో వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొనే వారు 9989028249, 9440637027, 9652025099 నంబర్లను సంప్రదించి రూ.500లు ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.